**3)వేమన భాషా శైలిని గురించి వివరించండి?**

**( లేదా)**

**వేమన కవితా రీతులను తెల్పండి?**

**( లేదా)**

**వేమన ప్రజాకవి- నిరూపించండి?**

**జ)** తెలుగు సాహిత్యంలో ప్రజాకవి వేమన విలక్షణమైన కవి. వేమన పద్య శైలి సరళంగా ఉంటుంది .పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వేమన పద్యాలు ఉంటాయి. అందుకే నేటికీ ప్రజల నాలుకలపై వేమన పద్యాలు నాట్యం చేస్తున్నాయి .వేమన పద్యాలు రాని తెలుగు వారు ఉండరు అనడం అతిశయోక్తి కాదు. వేమన పద్యాలన్నీ అందమైన ఆటవెలది ఛందస్సు లో ఉంటాయి. కొన్ని పద్యాలు ద్రాక్ష పాకంలా, మరి కొన్ని పద్యాలు నారికేళ పాకంలా ఉంటాయి.

చెప్పదలచుకున్న భావాన్ని మొదటి రెండు పాదాలలో చెబుతారు వేమన .మూడవ పాదంలో దృష్టాంతం( ఉదాహరణ) సమర్పిస్తాడు.తుపాకీ గుండు అయినా గురి  తప్పుతుందేమో గాని వేమన దృష్టాంతం గురి తప్పదు అన్న రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారి ఈ మాటలు అక్షర సత్యాలు. వేమన పద్యాలలో మకుటం 'విశ్వదాభిరామ వినురవేమ'. వేమన పద్యాలకు మకుటం కీర్తి కిరీటం వంటిది. వేమన తన పద్యాలలో తాత్విక భావాలను, మోక్ష రీతులను ,హేతువాద దృష్టిని, అభ్యుదయ భావాలను, సంఘు సంస్కరణ భావాలను ప్రతిపాదించాడు. మూఢ నమ్మకాలను ఖండించాడు. అల్పమైన పదాలలో అనల్పమైన భావాలను ఆవిష్కరించాడు. అందుకే వేమన ప్రజాకవి అయ్యాడు.

"వెన్న చేతబట్టి వివరంబు తెలియక
ఘృతము వెదకునట్టి కూళ భంగి
తాను దైవమయ్యి దైవాల గొల్చురా
విశ్వదాభిరామ వినురవేమ"

వెన్న చేతిలో ఉంచుకుని నెయ్యి కోసం వెతకడం ఎంతో అవివేకం. జీవాత్మలో ఉన్న పరమాత్మ రూపాన్ని దర్శించకపోవడం అంతే అవివేకమని వేమన ఆశించాడు.

"చదువులందు పాడి మెదవులందు స్త్రీల

పెదవులందు రాజ్య పదవులందు
ఆశలు లేనట్టి అయ్యలు ముక్తులు"

స్వార్థమైన విద్యల పట్ల వ్యామోహం, పాడి సంపాదన అభివృద్ధి పై కోరిక, స్త్రీ వ్యామోహం, రాజ్య పదవులందు ఆరాటం ఉన్న వారికి మోక్షం కలగదని వేమన చెప్పాడు. దుఃఖానికి కారణమైన కోరికలను నియంత్రించుకునే వారికి మాత్రమే మోక్షం లభిస్తుందని వివరించారు.

"కాశి కాశి అంచు కడుపేగబోదురు
అందువున్న దేవుడెందులేడో
ఇందు నందు గలడు హృదయంబు శుద్ధయిన"

హృదయం పవిత్రంగా ఉంటే హృదయంలోనే కాశీలోని దేవుడిని దర్శించవచ్చని చెప్పాడు. హేతువాద భావంతో అద్వైత భావాన్ని కూడా వేమన చక్కగా వివరించాడు.

ఈ విధంగా ప్రజాకవి వేమన తనదైన భాషా శైలితో, విశిష్టమైన కవితా రీతులతో శతక పద్యాలను రచించాడు. ప్రజాకవిగా ప్రజల హృదయాలలో నిలిచాడు.